COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం :

విజయవాడ,
తేది : 25 ఆగస్టు, 2022.

# లేపాక్షి నాలెడ్జ్ భూముల బదలాయింపును వెంటనే ఆపాలి

లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో రైతులనుండి సేకరించిన వేల కోట్ల విలువైన 8,841 ఎకరాల భూమిని కారుచౌకగా ఎర్తిన్ ప్రాజెక్ట్స్ కు అప్పగించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. భూముల బదలాయింపును తక్షణం నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. అభివృద్ధి పేరుతో వేల ఎకరాల భూమిని అతి చౌకగా సేకరించడం, వాటిని బ్యాంకులో తాకట్టు పెట్టి అప్పులు తీసుకొని దివాలా తీసినట్లు ప్రకటించుకోవడం సహించరాని నేరం. సెజ్ చట్టం ప్రకారం నిర్థిష్ట పనికి కేటాయించిన భూమిలో రెండు సంవత్సరాలలోపు పనులు ప్రారంభించకపోతే కేటాయింపులు రద్దు చేయాలని వున్నందున భూములు కోల్పోయిన రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

పది లక్షల కోట్ల పెట్టుబడులతో లక్షన్నర ఉద్యోగాల లక్ష్యంగా ఇందూ ప్రాజెక్ట్స్ లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం 2009లో భూములు తీసుకుంది. ఈ భూముల్లో 4,191 ఎకరాల భూములను వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పు తీసుకుంది. ఇందూ సంస్థ 2019 నాటికి దివాలా తీసింది. అప్పటికి రూ. 4,531.44 కోట్లు బకాయిపడింది. ఈ కంపెనీకి సంబంధించిన దివాలా పరిష్కారాన్ని హైద్రాబాద్‌కు చెందిన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ చేపట్టింది. 'ఎర్తిన్ ప్రాజెక్ట్స్' అనే కంపెనీ నుండి రూ.500 కోట్లను చెల్లించగలమని ఈ ట్రిబ్యునల్ ప్రతిపాదించినట్లు, దీనికి రుణదాతల కమిటీ అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి. దీన్ని ఆ కంపెనీ భాగస్వామి ధృవీకరించారు. ఇందూ కంపెనీ తాకట్టు పెట్టిన ఆస్తులు అన్ని ఎర్తిన్ కంపెనీకి బదిలీ కానున్నాయి. అందులో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు చెందిన 4,191 ఎకరాలు వున్నాయి.

లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం ఎపిఐఐసి సేకరించిన 8,844.01 ఎకరాల్లో ఎసైన్డ్ భూములు 5,811.18 ఎకరాలు, మిగిలిన 3,032.83 ఎకరాలు ప్రభుత్వానివి. ఎసైన్డ్ భూమి ఎకరాకు రూ. 1.75లక్షలు, ప్రభుత్వ భూమి సాగుచేసుకుంటున్న వారికి ఎకరాకు రూ. 50వేల నామమాత్రపు పరిహారంతో సేకరించారు.

భూములు కోల్పోయిన రైతులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెల్లడం, అప్పుల్లో కూరకపోవడం జరిగింది. కంపెనీ మాత్రం భూములను బ్యాంకుల్లో పెట్టి కోట్ల రూపాయలు తీసుకోవడం, తిరిగి అదే భూములను మరో కంపెనీ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడం ప్రజాధనాన్ని లూటీ చేయడమే. తక్షణం దీన్ని అడ్డుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాము. రిజర్వు బ్యాంకు జోక్యం చేసుకొని ప్రజల ఆస్తిని కాపాడాలని కోరుతున్నాము.

(వి.శ్రీనివాసరావు)
రాష్ట్ర కార్యదర్శి